క్లుప్తంగా

వ్యాక్సినేషన్ పరిశీలన


రికార్డులు పరిశీలిస్తున్న సూపర్‌వైజర్ వెంకటరమణ

తల్లాడ: తల్లాడ పీహెచ్‌సీలో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని బుధవారం జిల్లా వ్యాక్సిన్ సూపర్‌వైజర్ వెంకటరమణ పరిశీలించారు. ఈ సందర్భంగా నిల్వలు, రికార్డులు పరిశీలించిన ఆయన వ్యాక్సిన్ల ప్రాధాన్యతను తల్లులకు వివరించారు. మండల వైద్యాధికారి రత్నమనోహర్, హెల్త్ సూపర్‌వైజర్ పెద్ద పుల్లయ్య, ఫార్మసిస్ట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పరీక్షలపై భయాన్ని వీడాలి


ప్యాడ్లు పంపిణీ చేస్తున్న ఎంవీఐ వరప్రసాద్

వైరారూరల్: విద్యార్థులు పరీక్షల పట్ల భయాన్ని వీడి.. పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని వైరా మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ వరప్రసాద్ సూచించారు. గర్భిణులకు ఉచిత ఆటో సర్వీస్ సౌకర్యం కల్పిస్తున్న షేక్.లతీఫ్ బుధవారం కేజీ సిరిపురం జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులకు ఉచిత పరీక్ష ప్యాడ్లు, పరీక్ష సామగ్రి వితరణ చేయగా.. వాటిని ఎంవీఐ వరప్రసాద్ విద్యార్థులకు పంపిణీ చేశాడు.

పరీక్ష ప్యాడ్లు పంపిణీ

బోనకల్: మండలంలోని ఆళ్లపాడు ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు యువ భారత్ శక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆత్మకమిటీ డైరెక్టర్ కందుల పాపారావు, సంస్థ సభ్యుడు బాజీ పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, కంపాక్స్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, షేక్ చాంద్‌సాహెబ్, షేక్ ఇమామ్‌ఖాసీం, నజీర్, పాషా తదితరులు పాల్గొన్నారు.

కుట్టు మిషన్..

మధిర: మడుపల్లి గ్రామానికి చెందిన నాగసైదాకు బుధవారం కుట్టుమిషన్ పంపిణీ చేశారు. నాగసైదా కుటుంబం ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న విషయాన్ని మిత్రుల ద్వారా ప్రభుత్వ ఉపాధ్యాయుడు, సామాజిక సేవకుడు చేడే శ్రీనివాస్ తెలుసుకున్నారు. విషయాన్ని తన బాల్య మిత్రుడు సత్యనారాయణకు తెలుపగా.. స్పందించిన ఆయన కుట్టు మిషన్ అందించారు. దీంతో నాగసైదా కుటుంబీకులు శ్రీనివాస్, సూర్యనారాయణ లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు కోట జయరాజు, షేక్ చాంద్ పాషా, ఆవల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

మధిర: మధిర పట్టణంలోని విజయవాడ రోడ్డులో హెచ్‌పీ గ్యాస్ కార్యాలయం సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తికి గాయాలు అయ్యాయి. మధిర నుంచి విజయవాడ వైపు వెళ్తున్న కారు అతివేగంగా వచ్చి హెచ్‌పీ గ్యాస్ కార్యాలయం సమీపంలో రోడ్డు పక్కన ఆగి ఉన్న ఐస్ క్రీమ్ బండిని బలంగా ఢీకొట్టింది. దీంతో ఐస్‌క్రీమ్ బండి నిర్వాహకుడికి గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని మధిర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

గుండె పోటుతో యువకుడు మృతి

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి మండలంలోని గంగారం గ్రామానికి చెందిన ఓ యువకుడు గుండెపోటుతో మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గంగారం గ్రామానికి చెందిన గజవెల్లి నాగేశ్వరరావు, కుమారి దంపతులకు కుమారుడు ప్రేమ్‌సాగర్(23) ఛాతిలో నొప్పి వస్తుందంటూ ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. దీనిని గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. అప్పటికే గుండెపోటుతో మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. దీంతో బంధువులు, కుటుంబ సభ్యులు గ్రామస్తుల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుడు సీతానగరంలోని ఓ ప్రైవేట్ పామాయిల్ ఫ్యాక్టరీలో పని చేస్తున్నట్లు తేలిసింది.

ఎల్‌ఆర్‌ఎస్‌పై క్షేత్రస్థాయి పరిశీలన

బోనకల్: మండల కేంద్రంలో ఎల్‌ఆర్‌ఎస్‌పై తహసీల్దార్ పున్నం చందర్, వ్యవసాయ అధికారి వినయ్‌కుమార్ బుధవారం క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. సర్వేనంబర్ 29లో అనుమతులు లేని లేఅవుట్లలో కట్టడాలకు సంబంధించి క్షేత్రస్థాయి పరిశీలన జరిపి ప్రభుత్వం ఇచ్చిన 25శాతం రాయితీని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ లక్ష్మణ్‌నాయక్, ఏఈఓ రజిత తదితరులు పాల్గొన్నారు.


సర్వేనంబర్ 29లోని కట్టడాలను పరిశీలిస్తున్న రెవెన్యూ, వ్యవసాయ అధికారులు

అప్పుడో మాట.. ఇప్పుడో మాట

- వాహన టెండర్లలో సింగరేణి నిర్వాకం
- లబోదిబోమంటున్న భూ నిర్వాసితులు

సత్తుపల్లి: భూములు తీసుకునేటప్పుడు ఉపాధి కింద భూ నిర్వాసితులకు ప్రాధాన్యత ఇస్తామని నమ్మబలికి.. తీరా ఇప్పుడు కుటుంబానికి ఒక్కరికే అవకాశం కల్పిస్తామని సింగరేణి సంస్థ చెప్పటంపై భూ నిర్వాసితుల్లో నిరసన వ్యక్తమౌతుంది. సత్తుపల్లి మండలం జగన్నాథపురం గ్రామం మొత్తం సింగరేణి కిష్టారం ఓపెన్‌కాస్టు కింద తీసుకున్నారు. వీరందరికి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీతో సహా జగన్నాథపురం గ్రామాన్ని మరోచోట నిర్మించి ఇచ్చారు. వీరిలో కొందరు వాహనాలను టెండర్ ద్వారా దక్కించుకొని సింగరేణి సంస్థలో కిరాయికి తిప్పుతున్నారు.



15 వాహనాల కోసం టెండర్..

సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలో 15 వాహనాల కోసం సింగరేణి సంస్థ టెండర్లను ఆహ్వానించింది. 337మంది టెండర్లు దాఖలు చేసుకోగా 326మందికి లాటరీ తీశారు. దీనిలో సత్తుపల్లి మండలం జగన్నాథపురం గ్రామానికి చెందిన వాడే శ్రీను, సోయం సురేష్, మొగిలి కిరణ్‌లకు లాటరీ ద్వారా వాహనాలను తిప్పుకునేందుకు అవకాశం వచ్చింది. అయితే ఆ కుటుంబంలో మరొకరి వాహనం తిరుగుతున్నందున వీరికి వచ్చిన అవకాశాన్ని ఇవ్వటం లేదంటూ సింగరేణి సంస్థ నోటీసులు ఇవ్వటం పట్ల భూ నిర్వాసితులు మండిపడుతున్నారు. ఎవరి కుటుంబం వారి కింద గుర్తించి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇచ్చినా అధికారులు అన్నకు, తల్లికి వాహనాలు ఉంటే మా కుటుంబాలకు వాహనాలు ఎందుకు అవకాశం ఇవ్వరంటూ ప్రశ్నిస్తున్నారు.

నాలుగేళ్ల నుంచి..

వాహనాల టెండర్ కోసం నాలుగేళ్ల నుంచి జగన్నాథపురం భూ నిర్వాసితులు టెండర్లు దాఖలు చేస్తూనే ఉన్నారు. టెండర్ రుసుము, ఖర్చులు కలిపి ప్రతిసారి రూ.5వేల వరకు ఖర్చు అవుతుంది. ఇప్పటికి ఆరుసార్లు టెండర్లలో పాల్గొన్నందున ఒక్కొక్కరికి రూ.30వేల నుంచి రూ.40వేల వరకు ఖర్చు అయింది. మొదట్లోనే ఒక కుటుంబానికి ఒకరికే వాహనం టెండర్ సౌకర్యం కల్పిస్తామని చెప్పి ఉంటే అసలు టెండరే దాఖలు చేసేవాళ్లం కాదని.. ఇప్పుడు టెండర్ లాటరీలో వచ్చిన తర్వాత నిబంధనల పేరుతో టెండర్‌ను డిఫాల్ట్ చేయటం పట్ల భూ నిర్వాసితులు ఆందోళన వ్యక్తం చేశారు. ఎవరి కుటుంబం వారిది.. ఎవరి ఆధార్‌కార్డు వారిది.. ఎవరిళ్లు వారికి ఉండగా అందరిని కలిపి కుటుంబంగా గుర్తించటం ఎంతవరకు న్యాయమంటూ ప్రశ్నిస్తున్నారు.

టెండర్ రద్దు అన్యాయం..



నేను నాలుగేళ్ల నుంచి వాహనం కోసం టెండర్ వేస్తున్నా. కుటుంబంలో ఒకరికేనని ఎవరూ చెప్పలేదు. ఇప్పటికి ఏడుసార్లు టెండర్ వేశాను. నిబంధనల పేరుతో నా టెండర్‌ను రద్దు చేయటం అన్యాయం.

– వాడే శ్రీను, భూ నిర్వాసితుడు, జగన్నాథపురం

ఎవరి కుటుంబం వారిదే..



మా అమ్మ, మా అన్నలు అందరం వేర్వేరు కాపురాలు పెట్టుకున్నాం. ఎవరి కుటుంబం వారిది. నాకు భార్య, పిల్లలు ఉన్నారు. వాహనం పెడితే పొట్టపోసుకోవచ్చని ఆశతో టెండర్లలో పాల్గొంటే వచ్చిన అవకాశాన్ని తీసేస్తున్నారు.

– సురేష్, భూ నిర్వాసితుడు, జగన్నాథపురం

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు మార్కింగ్

ఎర్రుపాలెం: మండలంలోని రాజులదేవరపాడు గ్రామాన్ని ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టు కింద మంజూరు చేసింది. కాగా బుధవారం గ్రామానికి చెందిన ముగ్గురు లబ్ధిదారులు పెరుగు శ్రీలత, పొదిల వెంకట్రావమ్మ, లక్కిరెడ్డి కష్టవేణిల ఇళ్లకు హౌసింగ్ పీడీ శ్రీనివాస్, ఏఈ ఉమామహేశ్వరరావులు మార్కింగ్ ఇచ్చారు. నిబంధనల ప్రకారం ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారులు నిర్మించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి, ఎంపీడీఓ సురేందర్, గ్రామ సెక్రెటరీ విజయలక్ష్మి, కాంగ్రెస్ నాయకులు తిరుపతిరావు, వెంకటేశ్వర రెడ్డి, చిన్న పుల్లారెడ్డి, తదితరులున్నారు.


రాజులదేవరపాడులో మార్కింగ్ చేస్తున్న అధికారులు

సాగునీరు విడుదల చేయడం సంతోషం

సత్తుపల్లి: సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టు ద్వారా సాగునీటిని విడుదల చేయడం సంతోషంగా ఉందని సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. ఇన్నాళ్లకు కేసీఆర్ కృషిని కాంగ్రెస్ పార్టీ గుర్తించిందన్నారు. సీతారామ ద్వారా తొలి ఫలితం అందుకుంటున్న వైరా, మధిర, సత్తుపల్లి నియోజకవర్గాల రైతులు అదృష్ట వంతులన్నారు. సాగర్ ఆయకట్టుకు గోదావరి నీళ్లను తరలించడం మాజీ సీఎం కేసీఆర్ చేసిన కృషి వల్లే సాధ్యమైందనే విషయాన్ని జిల్లా రైతాంగం గుర్తించాలన్నారు. సీతారామ పెండింగ్ పనులను పూర్తి చేసి ఉమ్మడి జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు సాగునీరు అందించాలన్నారు. కృష్ణ, గోదావరి నదుల అనుసంధానం తెలంగాణ రైతులకు శ్రీరామరక్ష అని సండ్ర తెలిపారు.

పరామర్శ..

మాజీ జెడ్పీటీసీని పరామర్శించిన నాయకులు

కల్లూరు: మాజీ జెడ్పీటీసీ డాక్టర్ లక్కినేని రఘును బుధవారం ఆలిండియా క్రిస్టియన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎనోష్‌కుమార్ ఆధ్వర్యంలో క్రైస్తవ నాయకులు కలిసి పరామర్శించారు. రఘు ఇటీవల కంటి శస్త్ర చికిత్స చేయించుకోగా.. విషయం తెలుసుకున్న ఏఐసీసీ నాయకులు రఘు స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. కార్యక్రమంలో ఏఐసీసీ నాయకులు ధర్నాసి బాలరాజు, ఎబినైజర్, దయాకర్, జాన్ పరంజ్యోతి, రాజశేఖర్, స్టీఫెన్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవుల ఉపవాస దీక్షలు ప్రారంభం


దీక్ష తీసుకుంటున్న మహిళను ఆశీర్వదిస్తున్న విచారణ గురువు సురేష్ జోషి

కల్లూరు: కల్లూరు లిటిల్ ఫ్లవర్ చర్చిలో బుధవారం క్రైస్తవుల తపస్కాల ఉపవాస దీక్షలు విచారణ గురువులు రెవ॥ఫాదర్ సురేష్ జోషి ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి. దీక్షలు 40 రోజుల పాటు ప్రపంచ వ్యాప్తంగా అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారు. యేసుప్రభువు నేర్పిన పశ్చాత్తాపము, ఉపవాసం, పరివర్తన, ప్రార్థన, త్యాగం, దాన ధర్మాలతో భక్తి శ్రద్ధలతో నిమగ్నమై ఉంటారు. ఉపవాస దీక్షలు చేపట్టడం, దీక్షలో పాల్గొనడం, దేవుడిని ఆరాధించడం, ప్రేమ, దయ గుణాలతో మెలగాలని విచారణ గురువులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్‌సీఎం చర్చి సిస్టర్లు, మరియదళం, చర్చి కమిటి సభ్యులు, క్రైస్తవ భక్తులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి


తహసీల్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

ఎర్రుపాలెం: రైతుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోతే పోరాటాలు ఉధృతం చేస్తామని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు, రైతు సంఘం నాయకుడు దివ్వెల వీరయ్య, తెలంగాణా రైతు సంఘం జిల్లా నాయకుడు పెద్ద కోటేశ్వరరావు తెలిపారు. బుధవారం మండలంలోని తహసీల్ ఎదుట రైతులతో కలిసి ధర్నా నిర్వహించి తహసీల్దార్ ఎం.ఉషాశారదకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ప్రభాకర్, నాయకులు హనుమంతరావు, సంజీవరావు, వెంకట్రామయ్య, జోగయ్య, వీరాంజనేయులు, నాగులు మీరా, షేక్ లాల, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జాలిముడి ప్రాజెక్టు పరిశీలన


మధిర: మండలంలోని వైరా నదిపై నిర్మించిన జాలిముడి ప్రాజెక్టును బుధవారం జెడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్ రాజ్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా కమల్ రాజ్ మాట్లాడుతూ.. వరదకు ప్రాజెక్టు పిల్లర్ కృంగిపోయిందని, కాలువలు కొట్టుకుపోగా.. ప్లాస్టిక్‌పైపులు వేసుకొని నడుపుతున్నారని, కోట్ల రూపాయలతో నిర్మించినా సాగునీటి సమస్య తీరడం లేదన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ నాగేశ్వరరావు, నాయకులు భాస్కర్ రెడ్డి, శ్రీనివాసరావు, నరసింహారావు, పెద్ద బుచ్చయ్య, అప్పారావు, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'సంక్షోభంలో వ్యవసాయం'

ఏన్కూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాల వల్ల వ్యవసాయ రంగం దెబ్బతిని సంక్షోభంలో ఉందని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాగం హేమంతరావు అన్నారు. బుధవారం ఏన్కూరులో తెప్పల సత్యం అధ్యక్షతన నిర్వహించిన తెలంగాణ రైతు సంఘం మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలో మోదీ సర్కార్ కార్పొరేట్లకు దోచిపెడుతుంటే.. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి రైతుభరోసా పూర్తిస్థాయిలో చేయకుండా రైతులను మోసం చేస్తున్నారన్నారు. అనంతరం రైతు సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోగా.. మండల అధ్యక్ష, కార్యదర్శులుగా బానోత్ లఘుపతి, నల్లపాటి నరసింహారావులతో పాటు మరో 17 మంది కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రమేష్, గోవిందరావు, సీపీఐ, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ

సత్తుపల్లిరూరల్/కల్లూరు: ఖమ్మం రామ నరసయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 9న జరగనున్న మితవాదాలకు వ్యతిరేకంగా ప్రజాపందకే పోరునడిపిన రాయల సుభాష్ చంద్రబోస్(రవన్న) తొమ్మిదవ వర్ధంతి సభను జయప్రదం చేయాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం సత్తుపల్లి, కల్లూరులో పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా నాయకులు గంటా శ్రీనివాసరావు, వెంకన్న డివిజన్ కార్యవర్గ సభ్యులు అమర్లపూడి శరత్ మాట్లాడుతూ.. తెలుగు రాష్ట్రాల్లో విప్లవ ఉద్యమ నాయకుడిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా ఆ తర్వాత న్యూడెమోక్రసీ పార్టీకి దాదాపుగా రెండున్నర దశాబ్దాలకు పైగా రాష్ట్ర కార్యదర్శిగా పని చేశారని, కేంద్ర కమిటీ నాయకుడిగా ఉన్నారన్నారు. ఖమ్మం, వరంగల్, పశ్చిమగోదావరిజిల్లా ఏజన్సీ ఉద్యమానికి దశాబ్దాలంగా పునాదులు వేశారన్నారు. ఈ నెల 9వ తేదీన ఖమ్మంలో జరుగు వర్ధంతి సభకు ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, విద్యార్థులు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీయూసీఐ జిల్లా నాయకుడు పుల్లారావు, డివిజన్ నాయకుడు మల్యాద్రి, ప్రగతిశీల మహిళా సంఘం నాయకురాలు పరిమిళ, సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ మండల కార్యదర్శి తాటి రాజు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


సత్తుపల్లిరూరల్: పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

సకాలంలో రుణాలు చెల్లించాలి

సత్తుపల్లిటౌన్: తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించాలని డీసీసీబీ డిప్యూటీ రిజిస్ట్రార్ ఎ.శ్రీనివాసరావు కోరారు. సత్తుపల్లిలో బుధవారం రుణాలపై అవగాహన కల్పించారు. వ్యవసాయ రుణాలు, విద్యారుణాలు, గేదెల రుణాలు, ముద్ర రుణాలు, మార్ట్‌గేజ్ రుణాలు పొందిన వారు వాయిదాల పద్ధతిలో సకాలంలో చెల్లించాలని కోరారు. వ్యవసాయ రుణాలు పొందిన వారు ఏడాదిలోపు రెన్యూవల్ చేయడం ద్వారా ఏడు శాతం మాత్రమే వడ్డీ పడుతుందని, నిర్దిష్ట తేదీలోపు చెల్లించిన వారికి తిరిగి మూడు శాతం వారి ఖాతాకు జమ అవుతుందని తెలిపారు. అలా కాకుండా ఏడాదిలోపు రెన్యూవల్ చేయకపోయినచో అధిక వడ్డీ చెల్లించాల్సి వస్తుందని, ఇంకా ఎక్కువ సమయం అయినచో ఎన్‌పీఏ ఖాతా దారులుగా గుర్తించబడుతుందన్నారు. ఎన్‌పీఏ ఖాతాదారులు ఈ నెల 15లోగా రెన్యూవల్ చేసుకోవాలని, ఏ విధమైన బ్యాంక్ అవసరాలు ఉన్న, ఎటువంటి సందేహాలు ఉన్న నేరుగా ఖాతాదారులే తమ బ్యాంకును సంప్రదించాలని, దళారుల వద్దకు వెళ్లొద్దన్నారు. ఈ సమావేశంలో మ్యూజియం ప్రవీణ్, మేనేజర్లు జి.కిషోర్, శివ సత్యనారాయణ, సూపర్‌వైజర్లు జనార్దన్, రాకేష్ పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న డీసీసీబీ డిప్యూటీ రిజిస్ట్రార్ శ్రీనివాసరావు

విద్యార్థులకు ప్రతిభ పాటవ పరీక్ష

వేంసూరు: విద్యార్థులను ప్రోత్సహించేందుకు మండలస్థాయిలో బుధవారం చౌడవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రతిభ పాటవ పరీక్ష నిర్వహించారు. ఉపాధ్యాయ వృత్తిలో ఉండి మృతి చెందిన తెలగారపు చిన్న అప్పారావు జ్ఞాపకార్థం నిర్వహించిన ఈ పోటీల్లో మండలంలో 40 పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. విద్యార్థుల్లో పోటీతత్వం పెంచేందుకు ఈ పరీక్షలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. మొదటి ఐదు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు బహుమతులు, జ్ఞాపికలు అందించారు. ఈ కార్యక్రమంలో అడసర్లపాడు, వేంసూరు పాఠశాలల కాంప్లెక్స్ హెచ్‌ఎంలు శ్రీనివాసరావు, సుధాకర్‌రెడ్డి, నోడల్ అధికారి సత్యనారాయణ, పెద్ద అప్పారావు, యూనియన్ బాధ్యులు పాల్గొన్నారు.


విద్యార్థులకు జ్ఞాపికలు అందిస్తున్న దృశ్యం

టాలెంట్ టెస్ట్‌కు అనూహ్య స్పందన


బహుమతులు అందిస్తున్న ఎంఈఓ, శ్రీనివాసరెడ్డి

మధిర: మధిర పట్టణంలోని టీవీఎం పాఠశాలలో శ్రీకృష్ణ సూర్య టాలెంట్ టెస్ట్ నిర్వాహకులు బొగ్గుల శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం జరిగిన టాలెంట్ టెస్ట్‌కు అనూహ్యస్పందన లభించింది. మండల ప్రభుత్వ పాఠశాలల్లోని ప్రాథమిక స్థాయి విద్యార్థులకు శ్రీకృష్ణ సూర్య ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ టాలెంట్ టెస్ట్‌కు మండలంలోని అన్ని పాఠశాలల నుంచి 120 మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. ట్రస్ట్ అధ్యక్షులు బొగ్గుల శ్రీనివాస్ రెడ్డి మాటూరు ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఈ టాలెంట్ టెస్టులో మధిర హరిజనవాడ ప్రాథమిక పాఠశాలకు మొదటి బహుమతి, నిధానపురం, నాగవరప్పాడు, దెందుకూరు హరిజనవాడ పాఠశాలలకు ద్వితీయ స్థానాల్లో నిలువగా.. విజేతలకు ఎంఈఓ ప్రభాకర్ బహుమతులు అందించారు. కార్యక్రమంలో భరత్, శ్రీనిధి విద్యాసంస్థల అధినేతలు శీలం వెంకటరెడ్డి, అంజన్ బాబు, హై కేర్ ఆసుపత్రి అధినేత డాక్టర్ జంగా నవీన్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు చెరుపల్లి శ్రీహరి, ఎస్ విజయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

పోటీ పరీక్షలపై అవగాహన

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో టీఎస్‌కేసీ కోఆర్డినేటర్ డాక్టర్ కె.పద్మారాణి ఆధ్వర్యంలో బుధవారం పోటీ పరీక్షలపై అవగాహన నిర్వహించారు. కార్యక్రమానికి ప్రముఖ అర్థమెటిక్ నిపుణుడు డి.నర్సింహారావు విద్యార్థులకు పోటీ పరీక్షలు ఎంత ముఖ్యమైన అర్థమెటిక్, రీజనింగ్ విభాగాల నుంచి ఏ విధమైన ప్రశ్నలు అడుతారు..? వాటిని ఎలా ఎదుర్కొవాలో మెలకువలను వివరించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ ఎస్‌కె పీర్‌సాహెబ్ మాట్లాడుతూ.. బీఏ, బీకాం విద్యార్థులు అర్థమెటిక్ విభాగంలో ఎక్కువ మార్కులు సాధించినట్లయితే ప్రభుత్వ ఉద్యోగాలు పొందవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో మహేష్, డాక్టర్ బాలకృష్ణ, డాక్టర్ సీహెచ్ పూర్ణచంద్రరావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపాల్ పీర్‌సాహెబ్

మహిళా స్విమ్మర్ ప్రతిభ


మధిర: మధిర పట్టణానికి చెందిన పాములపాటి చంద్రకళ అనే ప్రభుత్వ ఉద్యోగిని స్విమ్మింగ్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ చాటింది. 2012లో ఏపీపీఎస్సీ నిర్వహించిన పరీక్షల్లో అధ్యాపకురాలిగా ఎంపికై సిరిపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోస్టింగ్ చేపట్టారు. ఆ తర్వాత బదిలీపై మధిర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేశారు. ఇటీవల ఖమ్మం ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలకు బదిలీపై వెళ్లారు. ఆమె మధిర స్విమ్మర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్విమ్మింగ్ నేర్చుకుని.. జనవరి 16న ఖమ్మం పటేల్ స్టేడియంలో ప్రభుత్వ ఉద్యోగులకు నిర్వహించిన స్విమ్మింగ్ పోటీలో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి ఎంపికైంది. జనవరి 23, 24 తేదీల్లో హైదరాబాద్‌లోని ఎల్బీస్టేడియంలో జరిగిన పోటీలో ప్రతిభ చూపి జాతీయస్థాయికి ఎంపికై ంది. ఈనెల 5నుంచి ప్రారంభమైన జాతీయస్థాయి పోటీలు 7తో ముగియనున్నాయి. దీంతో ఆమెకు మధిర స్విమ్మర్స్ సభ్యులు అభినందనలు తెలిపారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

ఇంటర్ విద్యార్థులకు పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు విద్యార్థులు వారి తల్లిదండ్రులను వెంట బెట్టుకొని నిర్ణీత సమయానికి పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. ప్రతీ విద్యార్థిని సిబ్బంది తనిఖీ చేసి పరీక్ష కేంద్రంలోకి పంపించారు. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా తాగు నీటి సౌకర్యంతో పాటు వైద్యసిబ్బందిని నియమించారు. అధికారులు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. పరీక్ష ఉదయం 9గంటల నుంచి 12గంటల వరకు కొనసాగింది. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు పకడ్బందీగా బందోబస్తు చేపట్టారు.

– సాక్షి నెట్‌వర్క్


మధిరలో తనిఖీలు నిర్వహిస్తున్న సిబ్బంది


ముదిగొండ: పరీక్ష రాసి వస్తున్న విద్యార్థులు


సత్తుపల్లిలో..


వైరా: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..


చింతకాని: నాగులవంచ పరీక్షా కేంద్రంలో..


కారేపల్లి: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..


మధిర: కుమారుడికి బెస్ట్ ఆఫ్ లక్ చెబుతున్న తండ్రి


బోనకల్‌లో..